# జీవితమే ఉగాది పచ్చడి

-యలమర్తి అనూరాధ

ఉషోదయానికి వెలుగు మూట విప్పుతూ సూర్య భగవానుడు సిద్ధమవుతున్న సమయంలో ఆ ఇంట అలారం మ్రోగింది.

"శ్రీరామచంద్రా! కొత్త సంవత్సరం. అందరినీ ప్రశాంతంగా చూసుకోమని నా ప్రార్థన" అంటూనే కళ్ళు తెరిచాడు విజయ రామారావు.

"తల్లీ! సీతమ్మ తల్లీ! నలు మూలలా ఉన్న నా పిల్లలకు వారి బిడ్డలకు ఆయు రారోగ్యాలు ప్రసాదించు" అంటూ మంచం దిగింది సౌభాగ్యలక్ష్మి.

ఇద్దరికీ అరవై వయసు దాటినా "మాకు వార్థక్యం వచ్చిందని మేము అనుకోం" అని ఉత్సాహంగా జీవితాన్ని గడిపేస్తున్నారా జంట. పిల్లలను తలచుకుంటే మాత్రం దిగులుతెర మబ్బులు ఆకాశాన్ని క్రమ్మిన దానికన్నా అధికంగా కమ్ముకుంటుంది. మిగతా అప్పుడంతా మామూలే!

ఉద్యోగ విరమణ పుణ్యమా అని హడావిడి పడవల్సిన అవసరం లేకపోయినా వేకువ ఝామునే లేవటం ధ్యానంలో కూర్చోవటం, వ్యాయామం చేయటం, నగర సంకీర్తనలో పాల్గొని.. దైనందిన కార్యక్రమంలో పడటం. ఏదీ క్రమం తప్పదు. అన్నీ టైము ప్రకారం సక్రమంగా జరిగిపోవల్సిందే.

పిల్లలందరినీ పండుగకు రమ్మని రాసారు కానీ అందరూ ఏదో ఒక కారణం చూపించారు. మొత్తానికి రాలేమని తేల్చేసారు. వాళ్ళంతా వస్తే ఇంటికి పండుగ కళ వస్తుందని ఆ దంపతులు ఆశపడ్డ మాట నిజమే! రావటం లేదని నిరాశ పడటం నిజమే! కానీ పండుగను పద్ధతిగా చేసుకోవటంలో ఒకరికొకరు సహకరించుకుంటూ ఆనందపు బిడ్డను ఆ ఇంట ఊయలలూపాలనే ప్రయత్నిస్తున్నారు. ఆ రోజు వారి జీవితం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు?

☆☆☆

"లక్ష్మీ! అలా 'రామేశ్వరం' ఇంటి దాకా వెళ్లి నాలుగు వేపరెబ్బలు తెస్తాను. బజార్లో కొనటం చూశాడంటే ఇక నన్ను బ్రతకనివ్వడు- అసలు నేను నీకు స్నేహితుడినేనా? హితుడు అన్న మాటను నొక్కి పలుకుతూ... బ్రహ్మాండమైన వేప చెట్టు నా ఇంట్లో ఉంటే డబ్బులు తగలేసి, మన స్నేహాన్ని కించపరుస్తూ అలాంటి పని చేస్తే మళ్ళీ నా ముఖం చూడకు" అంటూ పెద్ద దండకమే చదువుతాడు.

ఆయన మాటలకు ఆవిడ నవ్వుకుని గుమ్మంలో ముగ్గు పెడుతూనే "ఆయన దండకం చదవటం మాట దేముడెరుగు. మీరు మాత్రం చదివేశారు. తొందరగా వెళ్ళి తీసుకురండి. ఈలోపు నేను స్నానం చేసేస్తాను. మీరూ తలస్నానం చెయ్యాలి. ఆయనతో హస్కులో దిగమాకండి. ఇక్కడ పను లన్నింటికీ బ్రేక్ పడుతుంది."

"అలాగే! అలాగే!" అంటూ కదిలారాయన. భార్య పెద్దగా చదువుకోకపోయినా జీవితాంతం పట్టించుకోని ఆయన ఇప్పుడు ఇంగ్లీషు నేర్చు తున్నాడు. రేపు మన వాళ్ళతో మాట్లాడాలి కదే పిచ్చి మొద్దూ అంటాడు నాకెందుకండీ ఇవన్నీ అని ఆవిడ అంటే! బ్రేక్... హస్కు పదాలు తలుచుకొని మరోసారి నవ్వుకున్నారు.

పెరట్లో మామిడి చెట్టు రెమ్మలు కోసి ఉదయాన్నే గుమ్మానికి తోరణాలు కట్టిన భర్తను తలుచుకుంది. ప్రతి పనిలో తనకు సహాయం చేసే స్నేహతత్వానికి అనునిత్యం మనసులో ఏదో ఒక సమయంలో జోహారు చెబుతూనే ఉంటుంది.

"మామ్మగారూ! మామ్మగారు!" సింహద్వారం నుంచీ ప్రక్కింటి మాధవి.

"ఏమ్మా! మాధవీ! అమ్మ పండుగ పచ్చడి చేసేసిందా? ఇంకా నేను ప్రారంభించనే లేదు!"

"లేదు మామ్మా! ఇదుగో ఈ రెండు మామిడి కాయలు మీకిచ్చి రమ్మని పంపింది. నిన్న సాయంత్రమే ఇమ్మంది. నేనే మరచిపోయాను. ఏమీ అనుకోకండి!"

"తాతగారు నిన్ననే మార్కెట్‌లో తెచ్చారు."

ఇంకా ఆమె మాట పూర్తి కాకుండానే "మా మామిడి కాయలతోనే పచ్చడి చెయ్యాలి. తెల్సిందా? రుచి చూడడానికి మళ్ళీ వస్తా!" అంటూ మాయమయ్యింది మరో మాటకు అవకాశమివ్వకుండా!

టేబుల్ మీద మామిడి కాయలు తీసుకొని వంటింట్లో గట్టు మీద పెట్టింది. స్నానానికి వేడి నీళ్ళు తోడుకుంటుంటే పిల్లలు మళ్ళీ గుర్తువచ్చారు. అదే జనవరి ఫస్ట్ అయితే అందరి దగ్గర నుంచీ ఈపాటికి

ఫోన్లు వచ్చేసేవి. అసలైన కొత్త సంవత్సరం ఇదే అయినా వేలంవెర్రిలా విదేశీ వాళ్ళను, వాళ్ళ పద్ధతులను అనుకరిస్తూ ఉగాదికి ఉన్న సంస్కృతిని మరచి... జనవరే మాకు ముఖ్యం అంటున్నారు. ఇలాంటి తప్పు ఆలోచనలను ఎప్పుడు సరి చేసుకుంటారో?

అలాంటి ఆలోచనలతోనే స్నానం ముగించి పచ్చడి తయారు చేసే కార్యక్రమంలో పడిందావిడ. ముందు చింత పండు నానబెట్టింది. అరటి పండ్ల తొక్క వలిచి ప్లేటులో పెడుతోంది. ఇంతలో ఫోన్ మ్రోగటం ప్రారంభించింది.

ఆమెలో అంతులేని ఆనందం. ఏ పిల్లలు పలకరించబోతున్నారో... ఉత్కంఠ... గబగబా వెళ్ళి రిసీవర్ చేతిలోకి తీసుకొని హడావిడిగా చెవికి ఆనించి 'హలో!' అంది.

"హలో!"

అటువైపు పెద్ద కొడుకు బాబూరావు.

"ఏంరా! అంతా బాగున్నారా?"

"ఆ! అంతా బాగున్నాం! నీకో శుభ వార్తమ్మా!"

"ఏంటిరా!"

"నాన్న ముత్తాత అయ్యాడు."

"అంటే"

"నీ మనవరాలు భార్గవికి అబ్బాయి పుట్టాడు. నాన్న లేరా!"

"ఇప్పుడే బయటకు వెళ్ళారు. అప్పుడే నా చిట్టి తల్లి అయిందా? ఈ మధ్యే నెలలు అని ఎలా ఉందో అని కంగారు పడుతున్నాం. పండుగ పూట మంచి తీపి కబురు అందించావ్! కంగ్రాచ్యు లేషన్స్ చెప్పు."

"అలాగే అమ్మా! నాన్నగారు రాగానే చెప్పు. మళ్ళీ చేస్తాలే!" అంటూనే ఫోన్ పెట్టేసాడు.

"మళ్ళీ వద్దులేరా అని అనలేదు. బొంబాయి నుంచి ఫోన్. మళ్ళీ వాడికి ఎందుకు ఖర్చు" అని ఆమె ఆరాటం. ఈయన రాగానే చెప్పాలి. ఎంత మురిసిపోతారో! మొదటి తీపి వార్త విన్నాం కాబట్టి ఈ సంవత్సరమంతా తియ్యగా ఉంటుందన్న మాట.

ఇంతలో వేప పువ్వుతో విజయ రామారావు రానే వచ్చాడు.

"ఏమండీ! మీకో స్వీట్ న్యూస్. ఏమిటో చెప్పుకోండి చూద్దాం!"

"ఏమయి ఉంటుంది" అంటూనే వేప పువ్వులని తెంపి జల్లెడపైన వేస్తున్నాడాయన.

"తొందరగా ఊహించి చెప్పండి" కంగారు పెడుతూ ఆవిడ.

నాలుగు క్షణాలు గడవనిస్తే తనే చెప్పేస్తుందని ఆయనకి తెలుసు. అందుకే ఈ జాప్యం అని పాపం ఆవిడకే తెలియదు. అందుకే ఆడవాళ్ళను అమాయకులు అంటారు.

"అబ్బాయిలెవరికయినా ప్రమోషన్ వచ్చిందా?"

"కాదు. చెప్పాలి" మరింత రెట్టిస్తూ.

"ఇంకేముంటుందబ్బా!"

"చెప్పలేనని ఒప్పేసుకోండి. అప్పుడు చెబు తాను".

"ఆ మాట ఇందాకే చెబితే ఒప్పేసుకునేవాడ్ని కదా!"

చింతపండు రసం పిండి అందులో ఆయన జల్లెడ పట్టిన వేప పువ్వును కలుపుతూనే "చివరి సారి ఛాన్స్ ఇస్తున్నా".

"వద్దన్నా వినదేం"

"రెండో కోడలు ఏమన్నా పురుడు పోసుకుందా?"

"ఇక లాభం లేదు చెప్పేస్తున్నా."

"మన బాబూరావుకి మనవడు పుట్టాడు."

ఫోన్ 'ట్రింగ్... ట్రింగ్!' అంటూ రమ్మని పిలుస్తోంది.

"వాడే అయి ఉంటాడు. వెళ్ళండి. కంగ్రాచ్యు లేషన్స్ చెప్పండి. చిన్నతనంలోనే పెళ్ళి చేసేసారని పెద్దవాళ్ళని ఆడిపోసుకునేవాళ్ళం. అలా చెయ్యబట్టే ఇలా ముని మనవళ్ళను కూడా ఎత్తుకోగలుగు తున్నాం."

ఉండు. చూస్తాను అంటూ రిసీవర్ ఎత్తారు 'హలో' అనగానే అల్లుడు అమరనాథ్!

"ఓ! మామయ్యగారా! పండుగ బాగా జల్సా చేస్తున్నారా? ముష్టి మూడు వేలు మా ముఖాన పడేస్తే సరిపోతుందనుకున్నారా?"

"అదేం లేదు నాన్నా! మీ అల్లుడు జోక్ చేస్తున్నారు" వెంటనే అందుకుంది కూతురు కళ్యాణి.

అప్పటిదాకా చేదుగా మనసుకు తగిలిన మాటలు ఒక్కసారి మల్లెపూల సువాసనల్లా గుబా ళించాయి. ఆయనకి కూతురు మాటలు వినగానే.

"అలాగంటావేం!" అంటూనే ఆమె పొడుగాటి జుట్టును మొదలంటా మెలిత్రిప్పాడు కర్కశంగా.

తన అరుపు ఎక్కడ తండ్రికి వినిపిస్తుందో అని అతి బలవంతంగా గొంతులో నొక్కేసింది శంకరుడు

## ఓపద్యం

బరువులెత్తే కూలీల
శ్రామిక శబ్దాలను మించిన
ఓంకార నాదముందా!

గుండెల్లో సలసలకాగి
కళ్లతూముల్లోంచి దూకే
అశ్రువులను మించిన గంగాజలముందా!

ఆర్తులను ఆదుకోవాలనే
మంచి ఆలోచనను మించిన
సుముహూర్తముందా!

అరవిరిసిన మందారంలాంటి
చిన్నారి బోసినవ్వును మించిన
సూర్యోదయముందా!

నాటువేసి కలుపుతీసి కోతకోసే
శ్రమజీవన విన్యాసాలకంటే
యోగాసనాలేమున్నాయి!

మట్టిపొరల్ని అద్దుకొని
ఎర్రగా కళ్లు తెరిచిన
చిగురాకుకంటే
ప్రకృతికెత్తిన హారతి మరేముంది!

తొలికిరణంకన్న ముందులేచిన
పక్షుల కలకలం కంటే
సుప్రభాత గీతమేముంటుంది!

అలసి సొలసిన జీవనగతిలో
నలిగిన భావయాత్రముందు
తీర్థయాత్ర ఏ పాటిది?

తరగతి గదిలో
చిన్నిమొదళ్ల జ్ఞాన సమారాధాన ముందు
దేవాలయమెంత?

అక్షరాల మధ్య ఖాళీల్లో అమరిన
బాధాగాథల శక్తిముందు
మంత్రోచ్ఛాటన మెంతటిది?

అమ్మ కనుకొలకుల్లో దాగిన
గోర్వెచ్చని లాలనముందు
కదిలిరాని దైవం ఎంత?

కనలి కనలి అంగలార్చే
చిరంతన మహాదుఃఖం ముందు
కవిత్వమెంత?

-ఎన్. అరుణ

గరళాన్ని మింగినట్లు.

రిసీవర్‌ని క్రెడిల్ చేసింది.

"మళ్ళీ చెయ్యలేననుకున్నావా?"

రింగ్ చేస్తున్న అతన్ని రాక్షసుడు అని మనసులో తిట్టుకుంటూ ఏమైతే అది అయిందని ఫోన్ వైర్ ప్రక్కనే ఉన్న కత్తెరతో కత్తిరించి పారేసింది.

ఆ పని అతనిలోని ఆవేశాన్ని రెట్టింపు చేసింది.

గొంతు పిసికి చంపాలని ముందుకు వచ్చాడు.

"ఆగు! అక్కడ!" మహంకాళిలా గర్జించింది.

అడుగు ముందుకు వేసావంటే నీ గొంతు నేను పిసికి జైలుకు వెళతాను.

అంతే! మాటలు రాని వాడిలా మిగిలి పోయాడు.

ఎదురు తిరగనంతవరకే అట్టహాసం! ఎదురు నిలిస్తే అంతా బలాదూర్!

☆☆☆

ఇదంతా ఏమీ ఎరుగని ఆయన వదనం కూతుర్ని ఎక్కడ కష్టపెడుతున్నాడో అని ముకుళించుకుపోయింది. అల్లుడి మనస్తత్వం ఆయనకి ఎరుకే కాబట్టి.

మామిడి కాయ ముక్కలు తరుగుతున్న ఆవిడ "ఏమిటి! ఫోన్ మాట్లాడకుండా పెట్టేశారు" అడగనే అడిగింది.

"రాంగ్ నెంబర్". పండుగ పూట బాధ పెట్టటం ఎందుకని అబద్ధం చెప్పాడు. పెదాలు అబద్ధం చెప్పగలవు కానీ ముఖం నిజాన్నే చెబుతుంది.

"మరి అంతసేపు ఉన్నారేం! మీరేంటి అలా అయిపోయారు? ఏదో ఉంది నిజం చెప్పండి. ఎంతటి బాధనయినా ఈ గుండె తట్టుకోగలదు."

"ఏం లేదంటే వినవేం" విసుక్కున్నాడు.

మళ్ళీ ఫోన్ రింగయింది.

నేను తీస్తానుండండి. అంటూ ఆవిడ వెళ్ళి "హలో" చెప్పింది.

"నేను అత్తయ్యగారు అంజలిని."

"ఏమ్మా! బాగున్నావా? అబ్బాయి ఎలా ఉన్నాడు?"

"ఇద్దరం బాగున్నాం? అత్తయ్య గారండీ... అత్తయ్య గారండీ..."

"చెప్పమ్మా!"

"మీ అబ్బాయి చెబుతానంటే కాదని- నేనే చెప్పాలని..."

ఇరవై సంవత్సరాలయింది వాళ్ళ పెళ్ళయి.

ఇంతవరకూ పిల్లలు లేరు. ఒకవేళ విశేషమా అని తను అడిగితే కాకపోతే బాధపడుతుంది. అను కుంటూ ఉండగానే "డాక్టరుగారు మూడో నెల అని చెప్పారత్తయ్యా" అంది.

"ఎన్నాళ్ళకు నీ నోట ఇంత మంచి వార్త. ప్రక్కనే ఉంటే మామిడి కాయ ముక్కలు నోటికి అందించేదాన్ని అంజలీ! ఇప్పుడే పచ్చడిలోకి కోస్తున్నా!"

"మీ మాటలకే తిన్నంత ఆనందంగా ఉందత్తయ్యా!"

"భార్గవికి కూడా కొడుకు పుట్టాడట. చిన్నోడికి ఒకసారి ఫోనివ్వు"

"అలాగే"

"అమ్మా!"

"బదుద్దాయ్! బాగున్నావా! కోడలిని బాగా చూసుకో! లేటు వయసులో గర్భం. ఎంత జాగ్రత్తగా చూసుకుంటే అంత మంచిది."

"తప్పకుండా! నాన్నకు నువ్వే చెప్పు. నాకు సిగ్గుగా ఉంది."

"అలాగేలేరా" ఫోన్ పెట్టేసి ఆత్రంగా భర్తను చేరింది.

"చిన్నోడి భార్యకి మూడో నెలటండీ" అబ్బాయి మీతో చెప్పమన్నాడు.

"అలాగా" అన్నాడాయన నిరాసక్తంగా!

ఒక కంట్లో కన్నీరు. మరో కంట్లో పన్నీరులా ఉంది ఆయన పరిస్థితి.

"అబ్బ! ఏమిటండీ! మీరు మరీనూ. పెద్ద కోడలూ, నేనూ ఒకేసారి నెల తప్పామని తెలిసి ఎంత సిగ్గుపడ్డాం! ఆరోజులు తలుచుకుంటేనే గగుర్పాటుగా ఉంటుంది. ఈరోజు పచ్చడిలో బెల్లం ఎక్కువెయ్యాలి. ఒకదాని తర్వాత ఒకటి. అన్నీ శుభవార్తలే! ఎంత తీపి పచ్చడయినా రవ్వంత కారం చిలకరించాలట. పచ్చడిలో కారం కలిపింది.

పెరటి గుమ్మంలోంచి హడావుడిగా హర్నాధ రావు వచ్చి "ఒరేయ్! రామూ గోవిందరావు నీ కొంప ముంచాడురా! నిన్ను నమ్మించి చిట్ ఫండ్ కంపెనీ పెట్టించి రాత్రికి రాత్రి ఉడాయించాడు. జనాలంతా నీ మీదకు వస్తారు. వెంటనే ఇంటికి తాళం పెట్టండి."

"వద్దురా!" అంటున్నా వినకుండా ఇంటికి గడియపెట్టి తాళం వేసి జేబులో తాళం చెవులు వేసుకొని రోడ్డెక్కాడో లేదో జనం గుంపులు గుంపులుగా ఎదురుపడ్డారు.

వ్రేలాడుతున్న తాళం కప్పను చూసి మరింత రెచ్చిపోయారు.

"ఇద్దరూ కలిసే ఉడాయించినట్లున్నారు. తలుపులు బద్దలు కొడదాం." అంటున్న వాళ్ళను హర్నాధరావు వారించాడు. తాళం వేసిన తలుపులు బద్దలు కొడితే కేసు అవుతుంది. ఎక్కడికి వెళతాడు? ఎన్నాళ్ళుంటాడు? ఇక్కడికి రాడా? మనం చూడమా! ఆవేశం తగ్గించుకొని ఇళ్ళకు వెళ్ళండి' అని సర్దిచెప్పాడు.

చేసేదేమీ లేక వెనుతిరిగారందరూ.

"స్నేహితుడని జాలి పడి డబ్బు ఇచ్చి న్యాయంగా సంపాదిచంరా అంటే ఇలా కొంప ముంచుతాడా! తన పరువు పూర్తిగా ముంచేశాడే!" కుప్పకూలిపోయారు. పుండు మీద కారం జల్లినట్లు మనసు భగభగ మండిపోతోంది. న్యాయానికి ఈనాడు రోజులు కావని.

ఇదేమీ తెలియని సౌభాగ్యలక్ష్మి బెల్లం దంచి పచ్చడిలో కలిపి ఫినిష్ అంది.

దేముడికి పూజ చేసి నైవేద్యం పెట్టింది.

"ఏమండీ! ప్రసాదం తీసుకుందురు రండి" అని పిలిచింది.

ఉలుకు పలుకు లేదు.

"ఏం చేస్తున్నారబ్బా!" అంటూ గదిలోకి చూసింది.

అక్కడ పడుకుని ఉన్నారాయన.

"భలే వారండీ! ఉగాది పచ్చడి పెడతాను రమ్మంటే రారేం!"

"జీవితమే ఉగాది పచ్చడిలా రుచి చూపిం చాడు భగవంతుడు. ఇంక ప్రత్యేకంగా ఆ పచ్చడి తినాలా?"

ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు.

ఈరోజంతా వింతగా ఉందే!

ఆయన చేతిని తనే లాగి అరచేతిలో పచ్చడి పెట్టి "ఇక తినండి".

ఆమె తృప్తి కోసం ఆయన ఆ ప్రసాదాన్ని స్వీకరించాడు.

ఆయనొక్కరు తింటే తన పిల్లలూ, వాళ్ళ పిల్లలూ కూడా తిన్నంత సంతృప్తి ఆమెకు.

కళ్ళు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళింది తనూ ఉగాది పచ్చడి ప్రసాదం తీసుకోవటానికి . కొన్ని నిజాలు తెలియకుండా ఉంటేనే ఆనందం!

■